జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్లుడబ్లూడబ్లూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 23-06-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 53 పేజీలు: 4 వెల : రూ.7

## అంబేడ్కర్ జంక్షన్ రోడ్డు..
# మాయం



**శ్రీకాకుళం క్రైం, జూన్ 22 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే రోడ్డు మాయమైంది.. సుమారు 60 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతం సగం మాత్రమే కనిపిస్తోంది. ఈ రూట్‌లో నిబంధనలకు విరుద్ధంగా పలు బహుళ అంతస్థుల నిర్మాణాలు, ఆసుపత్రులు, హోటళ్లు నిర్మించారు. భవన నిర్మాణ సమయంలో పార్కింగ్ కోసం స్థలాన్ని యజమానులు వదులుకోలేదు. కళాశాలకు, ఆసుపత్రులకు, శాంతినగర్, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. ఆసుపత్రులు, హోటళ్ల ముందు వాహనచోదకులు పార్కింగ్ చేస్తున్నారు. ఒకవైపు వాహనాలు, మరోవైపు పండ్ల దుకాణాలు, హోటళ్లు, ఉండడంతో 60 అడుగుల రోడ్డు 30 అడుగులు వెడల్పుతో కనిపిస్తోంది. రోడ్డు మధ్యలో డివైడర్ లేకపోవడంతో వాహనచోదకులు సైతం అడ్డదిడ్డంగా వెళుతున్నారు. దీనివల్ల నిత్యం ఈ రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రిమ్స్ ఆసుపత్రికి వెళ్లే అంబులెన్సులు ఈ రూట్‌లోనే వెళుతుంటాయి. ఈ రోడ్డుపైనే వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో ఒక్కోసారి అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ రోడ్డుకు ఇరువైపులా లక్షలాది రూపాయలు వెచ్చించి ఫుట్‌పాత్‌ను నిర్మించారు. ప్రస్తుతం ఆ ఫుట్‌పాత్‌ల జాడే లేదు. అవి ఆక్రమణలకు గురయ్యాయి. పండ్ల దుకాణాలు, ఇతర షాపులు వాటిపైనే పెట్టుకున్నారు. నగరపాలకసంస్థ, పోలీసులు మాత్రం తమకు పట్టదన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఈ రోడ్డు పూర్తి వెడల్పు చూడాలంటే మళ్లీ జూన్ 26, ఆగస్టు15 వరకూ ఆగాల్సిందే. లేకుంటే ముఖ్యమంత్రులు ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎమైనా సభలు, సమావేశాలు నిర్వహిస్తే కూడా ఈ పూర్తి రోడ్డు కనిపిస్తుంది. ఆ తర్వాత రోజులంతా మాయమవుతోంది. ఈ రోడ్డే కాదు. శ్రీకాకుళం నగరంలోని జీటీరోడ్డు, తదితర రహదారుల్లోనూ ఇదే పరిస్థితి. జీటీరోడ్డు మధ్యలో వాహనాల పార్కింగ్‌కు పోలీసులు అనుమతిచ్చారు. అయితే కొందరు వాహనచోదకులు రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుతున్నారు.

### అవతారం సార్.. మీరు సూపరు..

శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐగా అవతారం ఈ ఏడాది కొత్తలో బాధ్యతలు స్వీకరించారు. కొద్ది రోజులకే ఆయన అంబేడ్కర్ జంక్షన్ రోడ్డుకు వచ్చారు. పండ్ల దుకాణాలు, హోటళ్లు, ఆసుపత్రుల యాజమాన్యాలతో మాట్లాడారు. రోడ్డును ఆక్రమిస్తే కేసులు పెడతామని, పండ్ల దుకాణాలు తొలగిస్తామని, హోటళ్లపై కొరడా ఝుళిపిస్తామని హెచ్చరికలు చేశారు. రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తే సంబంధిత షాపులు, భవనాల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. దీంతో హమ్మయ్య ఈ రోడ్డు విశాలంగా ఉంటుందని అందరూ భావించారు. అక్కడికి రెండు రోజుల తర్వాత షరా మామూలే. సీఐ అవతారం చేసిన హడావుడి అంతా ఉత్తుత్తిదే అని తేలిపోయింది. మళ్లీ ఈ రోడ్డు.. గతంలో మాదిరిగానే మారిపోయింది. ఎవరొచ్చినా.. ఏం చేయలేరు అన్న భావన నగరవాసుల్లో ఉంది. అంతేగా.. అంతేగా..!

- * కనిపించని ఫుట్‌పాత్
- * రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్
- * నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- * ఈ రహదారిలో నిత్యం ప్రమాదాలు
- * బాధ్యతలు స్వీకరించిన కొత్తలో కొరడా ఝుళిపించిన ట్రాఫిక్ సీఐ అవతారం
- * చోద్యం చూస్తున్న పోలీసు, నగరపాలక సంస్థ
- * ఆ తర్వాత షరా మామూలే





## శ్రీకాకుళం నగరపాలక సంస్థ
# కమిషనర్ బదిలీ
### ప్రకాశం జిల్లా కలెక్టరుగా తమీన్ అన్సారియా నియామకం




**శ్రీకాకుళం, జూన్ 22 (వార్త):** రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు అన్నమయ్య జిల్లా జేసీగా పని చేశారు. ఈమె భర్త 2012 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మనజీర్ జిలానీ సామూన్ ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. గత ప్రభుత్వం ఇద్దరినీ ఒకేసారి జిల్లాకు బదిలీ చేసింది. ప్రస్తుతం ఆమెకు ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా స్థానచలనం కల్పించారు. ఆమె స్థానంలో కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు.

# రిమ్స్‌లో దొంగలుపై.. విచారణ



- * సీసీ కెమెరాలు పరిశీలించిన ఆసుపత్రి అధికారులు
- * ఆర్థోపెడిక్ వార్డుకు వెళ్లి వివరాలు సేకరించిన సూపరింటెండెంట్

**శ్రీకాకుళం, జూన్ 22 (వార్త):** జిల్లా కేంద్రంలోని 'రిమ్స్ ఆసుపత్రిలో దొంగలు' పేరిట 'వార్త'లో వెలువడిన కథనానికి ఆసుపత్రిలోని ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం ఆసుపత్రిలోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బంగారం, నగదు, ఫోన్ పోగొట్టుకున్న వారి నుంచి వివరాలు సేకరించారు. ఆర్థోపెడిక్ వార్డులో సిబ్బందిని విచారించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.షకీలా, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ బి.సుభాషిణిలు వార్డుకు వెళ్లి ఆరా తీశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వార్డులో ఉన్న రోగులు, వారి బంధువులతో మాట్లాడి వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇస్తున్న భోజన నాణ్యత ఎలా ఉందన్న దానిపై వివరాలు అడిగారు. రోగులు సైతం రాత్రివేళ పడుకునేలా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సూపరింటెండెంట్ అన్నారు. సూపరింటెండెంట్ వెంట అసిస్టెంట్ ఆర్ఎంఓలు డాక్టర్ అనురాధ, డాక్టర్ రమేష్ నాయుడు, నర్సింగ్ ఇన్‌చార్జీలు ఉన్నారు.



## ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేస్తున్నాం

### శ్రీ లక్ష్మి గ్యాస్ ఏజెన్సీ అధినేత పెంట శ్రీనివాస్



**పలాస జూన్ 22(వార్త):** పలాస మండలంలోని గ్రామాలకు గ్యాస్ డోర్ డెలివరి విషయంలో లోపాలు లేవని శ్రీ లక్ష్మి గ్యాస్ ఏజెన్సీ అధినేత పెంట శ్రీనివాస్ శనివారం తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు ఇంటింటికి గ్యాస్ అందిస్తున్నామన్నారు. గ్యాస్ అక్రమ నిల్వలు ఇక్కడ లేవన్నారు. వినియోగదారునికి ఏదైనా సమస్య ఉంటే తమ కార్యాలయానికి ఫోన్ చేస్తే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోదారులు అందుబాటులో లేక పోతే వారికి గ్యాస్ అందించేందుకు వీలు ఉండదన్నారు. ఏ లబ్ధిదారునికైనా ఇబ్బంది ఉంటే కార్యాలయానికి రావడం గాని, ఫోన్‌లో సంప్రదించడం చేయాలని శ్రీనివాస్ తెలిపారు.

# జగన్నాథుని.. నేత్రోత్సవం



**హిరమండలం, జూన్22 (వార్త):** జై...జగన్నాధా... జై జై జగన్నాధా అంటూ భక్తులు భక్తి పారవశ్యంతో పులకరించిపోయారు. శనివారం జ్యేష్ట పౌర్ణమి కావటంతో మండల కేంద్రం జగన్నాథ ఆలయంలో జగన్నాధుని నేత్రోత్సవం కనుల పండుగగా జరిగింది. ఆలయ అర్చకులు శ్రీనివాస పాడి,సురేష్ పాడీలు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగన్నాథ స్వామి కళ్లకు పుణ్య జలాలతో అభిషేకించారు. రధాయాత్ర తొలి ఘట్టంగా జగన్నాథ స్వామిని అర్చకులు నూతన వస్త్రాలతో అలంకరించి హారతులు ఇచ్చారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ 15 రోజుల పాటు జగన్నాధుడు చీకటి గదిలో విశ్రాంతి తీసుకుంటారని, జూలై 7న నిర్వహించనున్న రధయాత్రతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. జగన్నాథ స్వామి నేత్రోత్సవానికి భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని నేత్రోత్సవ ఘట్టాన్ని తిలకించారు.

### జగన్నాథ స్వామికి దేవస్నానం

**వీరఘట్టం జూన్ 22 (వార్త):** జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా శనివారం స్థానిక శ్రీ జగన్నాథ స్వామి దేవతా మూర్తులకు దేవాదాయ శాఖ ఈవో మురళీ కృష్ణ నేతృత్వంలో వంశపారంపర్య అర్చకులు లింగ రాజు రథో ఆధ్వర్యంలో జ్యేష్టాభిషేకం (దేవస్నానం) నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలు, పళ్ల రసాలు, నారి కేలాలతో స్వామివారికి అభిషేకం చేశారు. జూలై 6 తేదీన చక్ర ప్రతిష్ట, 7న రథాయాత్ర, 11న హీరా పంచమి, 15న మారు రథయాత్ర ఉంటుందని వారు వివరించారు.

### ఘనంగా జ్యేష్టాభిషేకాలు

**ఇచ్ఛాపురం, జూన్ 22 (వార్త):** స్థానిక జగన్నాథ స్వామి ఆలయంలో శనివారం జేష్ట పౌర్ణమి సందర్భంగా బలభద్ర, సుభద్ర, సుధర్శన జగన్నాధ స్వామికి పంచామృతాలు, సుగంద పరిమళమైన గంగాజలంతొ అభిషేకాలు నిర్వహించారు., విష్వక్సేన పుజ, పుణ్యాహవచనం, నవకలశారాధన ,పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి పుష్పయాగం 12 రకాల పుష్పలతో అర్చన నిర్వహించారు.


### నేత్రపర్వం.. వాసుదేవుని నిజరూపం



**మందస, జూన్ 22 (వార్త):** భక్తుల కొంగు బంగారమైన వాసు దేవుని నిజరూపం దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. స్వామివారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రయుతం కావడంతో ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసు కూర్మాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. ఓ వైపు శనివారం కావడంతో పాటు మరో వైపు స్వామి జన్మనక్షత్రం ఒకే రోజు కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. అభిషేకాలు అనంతరం పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, తులసీ దళాలు, పూల మాలలతో స్వామిని అలంకరించారు. నిజ రూపధారునిగా దర్శనమిచ్చిన స్వామిని దర్శించుకుని, భక్తులు తన్మయత్వం పొందారు. అనంతరం అర్చకులు తీర్ధ, ప్రసాదాలను అందజేశారు.







## ఉద్దానంలో పరిశ్రమలు స్థాపించండి

### ఎన్ఆర్ఐలను కోరిన ఎమ్మెల్యే శిరీష

**పలాస, జూన్ 22 (వార్త):** ఉద్దాన ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు ఎన్నారై మహిళలు సహకరించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. విజయవాడలోని హెూటల్ మురళీ ఫార్చ్యూన్‌లో ఎన్ఆర్ఐ మహిళా వింగ్ ఆధ్వర్యంలో తెలుగు వారి నారీ భేరిలో శిరీష పాల్గొని మాట్లాడారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి సహాయం చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. ఉద్దానంలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని పల్లెలలో మహిళల జీవన ప్రమాణాలు మార్చాలని కోరారు. ఉద్దానం మహిళలకు కష్టబడే వ్యక్తిత్వం ఉందని అయితే వారికి సరైన పరిశ్రమలు ఏర్పరిస్తే వారి జీవన ప్రమాణాలు మారుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీకి ఎన్నికైనా మహిళా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## మత్తు పదార్ధాల వాడకం నేరం




**మెళియాపుట్టి, జూన్ 22(వార్త):** మత్తు పదార్ధాల వాడకం నేరమని టెక్కలి ఎస్ఈబీ ఎస్ఐ గణేష్ అన్నారు. శనివారం మెళియాపుట్టి మండల కేంద్రంలోని స్థానిక దుక్క రాజన్నరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు 'పరివర్తన-అవగాహన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమన్నారు. చుట్టూరా ఎటువంటి సంఘ విద్రోహ శక్తులు కనిపించినా రూపు మాపేందుకు తమతో కలిసి అడుగులు వేయాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో అధికంగా నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయని, దీన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పలువురు విద్యార్థులు మత్తుపదార్ధాలకు బానిసలవుతున్నారని, దీనివల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పైడి పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్తతో సంపదను సృష్టించాలి



**మెళియాపుట్టి, జూన్22(వార్త):** చెత్తతో సంపదను సృష్టించాలని డీఎల్పీవో ఐవీ రమణ అన్నారు. శనివారం మండలంలోని పెద్దపద్మాపురంలో గల సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్తను సేకరించే సిబ్బంది తడి, పొడి చెత్తగా వేరు చేసే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సంపద సృష్టి కేంద్రాల తొట్టెల్లో తడి చెత్త కుళ్ళబెట్టి వానపాములు వదిలి వర్మీ కంపోస్ట్ తయారు చేసుకోవాలన్నారు. అనంతరం షెడ్డు నిర్వహణకు సూచనలందించారు. ఆయన వెంట పంచాయతీ విస్తరణ అధికారి టి.తారకేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ అప్పారావు ఉన్నారు.

## కళ్యాణ మిత్రలను కొనసాగించండి

**ఇచ్ఛాపురం, జూన్ 22 (వార్త):** చంద్రన్న పెళ్లి కానుక కళ్యాణ మిత్రలను కొనసాగించాలని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి జనసేన ఇంచార్జ్ దాసరి రాజుకు కళ్యాణ మిత్రలు వినతి పత్రం ఇచ్చారు. కళ్యాణ మిత్రలు గత ప్రభుత్వంలో చంద్రన్న పెళ్లి కానుక పథకంలో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి 10 మంది కళ్యాణ మిత్రలగా పనిచేసారని తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వంలో ఎప్పటి లాగానే కళ్యాణ మిత్రలుగా 18 నెలలు విధుల్లో కొనసాగించారని, దానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో లక్ష్మి, రోహిణి, రేణుక, పుష్ప, నాని, పూజ, అరుణ, హేమలత ఉన్నారు.

# టీడీపీది విధ్వంసకర పాలన

### మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



**పలాస, జూన్ 22 (వార్త):** రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ప్రభుత్వంపై మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. శనివారం కాశీబుగ్గలోని ప్రగతి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఇంతటి బరితెగింపు ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదన్నారు. ప్రతిపక్షం అనేది ఉండకూడదని, ఆపార్టీ నాయకుల్ని ఉంచకూడదని, ఆ పార్టీకి చెందిన భవనాలను కూలగొట్టాలనే దుర్మార్గపు నిర్ణయాలతో ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన దగ్గర నుంచి పరిశీలిస్తే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోకూడా జరిగిన హింసాకాండ కూడా ఈ ప్రభుత్వ ఉద్దేశాలను చెప్పకనే చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో అసలు రాజ్యాంగం ఉందా? లేదా? చట్టం పనిచేస్తుందా? లేదా? వ్యవస్థలు ఉన్నాయా? లేవా? అన్న సందేహాలు ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తున్నాయన్నారు. ప్రమాణస్వీకారం చేసి 10 రోజులు కాకముందే రాష్ట్రంలో సృష్టించిన ఈ భయానక పరిస్థితుల ద్వారా రాబోయే ఐదేళ్లు కూడా రాష్ట్రంలో ఎలాంటి పాలన కొనసాగుతుందనే విషయాన్ని చాలా స్పష్టంగా చెప్తున్నారన్నారు. ఎక్కడైతే కూల్చి వేత మొదలౌతుందో అక్కడే పునర్నిర్మాణం కూడా మొదలౌతుందని, ఎక్కడైతే వినాశనం మొదలౌతుందో అక్కడ పునః సృష్టి మొదలౌతుందని గమనించాలన్నారు.

## నేడు పలాస మండల సమావేశం

**పలాస, జూన్ 22(వార్త):** పలాస మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 23న నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అధికారి మెట్ట వైకుంఠరావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొంటారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

## గురుకులంలో మిగులు సీట్ల భర్తీ

**మందస, జూన్ 22 (వార్త):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్టు ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి చెప్పారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ, రాధాకృష్ణపురం సమీపంలో గల గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి 8, 9 తరగతులకు ఎస్సీ విద్యార్థులు, 6,7 తరగతులకు ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 26వ తేదీలోగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు ప్రవేశపరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు.

# పలాసలో మెడికల్ సిండికేట్

*** ఓ మెడికల్ షాపు యాజమని ఆధ్వర్యంలో దందా * నిబంధనలు అతిక్రమిస్తున్న కొందరు * కాసుల మాయలో పట్టించుకోని సంబంధిత అధికారులు**



**పలాస జూన్ 22(వార్త):** పలాస కాశీబుగ్గలో మోసాలు పెరిగిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. వంటకాల్లో వాడే ఉప్పు నుంచి తినే బియ్యం వరకు కల్తీ సరుకులు అమ్మకాలు జరుగుతున్నాయని ఇక్కడ ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రజా ఆరోగ్యానికి వాడే మెడిసిన్ అమ్మకాల్లోను నాసి రకము మందులు అమ్మకాలు చేస్తూ కొందరు మెడికల్ షాపుల యజమానులు సొమ్ములు చేసుకుంటున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ మెడికల్ సిండికేట్‌దే రాజ్యం నడుస్తుందన్న ఇక్కడ విమర్శలు ఉన్నాయి. రోగికి వ్యాధి నివారణకు డాక్టర్ రాసిన మందులకు బదులు వేరే మందులు అంటగడుతున్నారు. సర్కార్ నిబంధన ప్రకారం మెడికల్ షాపు ఏర్పాటుకు డ్రగ్ అండ్ కెమిస్ట్రీ సర్టిఫికెట్ ఉండాలి. పలాస కాశీబుగ్గలో మాత్రం చాలా మెడికల్ షాపుల నిర్వాహకులకు ఎటువంటి సర్టిఫికెట్ లేదు. కొందరు డ్రగ్ అండ్ కెమిస్ట్రీ చదువుకున్న వారి వద్ద నుంచి డ్రగ్ అండ్ కెమిస్ట్రీ సర్టిఫికెట్ అద్దెకి తీసుకొని కొందరు మందుల షాపులు నడుపుతున్నారు. పలాస కాశీబుగ్గలో ఓ మెడికల్ షాపు యజమాని కొందరితో సిండికేట్ అయి అనధికార మందుల షాపులు ఏర్పాటు చేస్తున్నాడు. దీనికి కొందరు అధికారులకు కాసులు ఇస్తూ మేనేజ్ చేస్తున్నాడు. ఈ మెడికల్

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ మంజూరు చేయాలి

**శ్రీకాకుళం టౌన్, జూన్ 22 (వార్త):** రాష్ట్రంలో కూటమిగా గెలిచిన కొత్త ప్రభుత్వానికి ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అభినందనలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనలో సిక్కోలు ఆదివాసీలు ఐటిడిఏను కోల్పోయారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని, ఆ హామీని అమలు చేయాలని కోరారు. ఆదివాసిల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెజ్జి కృష్ణ, సరుబుజ్జిలి మండల అధ్యక్షులు సవర.శోభన్, శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ సభ్యులు పాపారావు, జన్ని.మోహన్, కే.హరీష్,స్. జోగారావు, పి.ప్రకాష్ పాల్గొన్నారు.



## బూర్జ పీఎస్ తనిఖీ

**బూర్జ, జూన్ 22 (వార్త):** బూర్జ పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక శనివారం ఉదయం సందర్శించారు. జిల్లా పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనధికార కేసు ప్రాపర్టీని పోలీస్‌స్టేషన్‌లో ఉంచకుండా కోర్టు ఉత్తర్వుల మేరకు డిస్పోజల్ చేయాలన్నారు. స్టేషన్ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తుపై అధికారులను అడిగి తెలుసుకుని, దర్యాప్తుపై దిశానిర్దేశం చేశారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రణాళిక మేరకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఆమె వెంట ఆమదాలవలస సీఐ దివాకర్, బుర్జ ఎస్ఐ ఉన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి



**వీరఘట్టం, జూన్ 22 (వార్త):** ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో ఎం.వి.బాలసుబ్రమణ్యం సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్యశాఖ, వెలుగు సిబ్బందితో పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్త హీనత ఉన్న గుర్తించి వారిని హీమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేవరకు పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. ఐదేళ్ళ లోపు పిల్లల్లో పోషకాహార ఎదుగుదల లోపం గుర్తిస్తే వాటిని అధిగమించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.బాలికల ఆరోగ్యం,పౌష్ఠికాహారం,సరైన వివాహ వయస్సు పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డ్రైడే కార్యక్రమాలు శాఖల సమన్వయంతో నిర్వహించి ప్రజలు పాటించేలా చైతన్యం కల్పించాలన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించి,చికిత్స అందజేయడం ద్వారా వ్యాధి తీవ్రత చెందకుండా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శివున్నాయుడు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## దండుగోపాలపురంలో విత్తనాలు పంపిణీ



**సంతబొమ్మాళి, జూన్ 22 (వార్త):** దండుగోపాలపురం రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాలను శనివారం రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెట్లతాండ్ర సర్పంచ్ పంగ అసిరి నాయుడు, ఆరికవలస సర్పంచ్ గున్న దండాశి, దండుగోపాలపురం మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, సంతబొమ్మాళి మండలం ఐటీడీపి అధ్యక్షుడు బెండి అరుణ్ కుమార్ రైతులకు అందించారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆరంగి మధు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆనంద్‌తో పాటు రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్పత్తి సంఘాలతో రైతులకు ఎంతో మేలు

**మందస, జూన్ 22 (వార్త):** మందస మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో వీవోఏల రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ విఓఏలు అందరూ ఈనెలాఖరులోగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. పొదుపులు, అంతర్గత అప్పులు టైమ్ షెడ్యూల్డ్ ప్రకారం అప్లోడ్ చెయ్యాలని వీవోఏలకు, సీసీలకు సూచించారు. స్త్రీనిధి రికవరీలు నూటికి నూరు శాతం ఉండేటట్లు రీపేమెంట్ చెయ్యాలని ఆదేశించారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, ఎల్ సి శ్రీనివాస్, అధ్యక్షులు కాంతమ్మ, కోశాధికారి విజయశ్రీ, సీసీలు, విఓఏలు, అకౌంటెంట్ కళ్యాణి పాల్గొన్నారు.

# ఖాదీ కార్మికులకు వెన్నుపోటు

*** కొందరి స్వార్థంతో కార్మికులకు గిట్టుబాటుకాని నేత పని * ఇలానే కొనసాగితే పొందూరు ఖాదీ కనుమరుగయ్యే అవకాశం * ఖాదీ అధికారులు జోక్యం చేసుకోవాలని కార్మికుల వినతి**

**పొందూరు, జూన్ 22 (వార్త):** భారత దేశంలో ఖాదీకి మంచి గుర్తింపు వుంది. అందులో పొందూరు ఖద్దరు కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉంది. దీనిని అభివృద్ధి చేసేందుకు ఎంతో మంది నాయకులు అధికారులు, సొసైటీలు ఎంతో కష్టపడుతున్నాయి. కానీ కొంతమంది స్వార్థ ప్రయోజనాలతో కార్మికులకు గిట్టుబాటు ధర రావడం లేదు. పని చేసే వారి సంఖ్య తగ్గిపోవడంతో నూలు వడికే వారు తగ్గిపోయారు. దీనివల్ల ఖాదీ దుస్తుల తయారీ తగ్గుముఖం పట్టింది. వీరిద్దరూ పనిచేస్తేనే ఖాదీ దుస్తుల దిగుబడి పెరిగి కొనుగోలు చేసేవారు పెరిగి తద్వారా ఎగుమతులు పెరిగి పొందూరు ఖాదీకి గుర్తింపు వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నూలు వడికే వారి శ్రమను గుర్తించకుండడమే కాకుండా వారి కష్టాన్ని దోచుకుంటూ వారికి కనీస మజూరు కూడా ఇవ్వకుండా ఖాదీ ఉద్యోగులు మోసం చేస్తున్నారంటూ కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. నూలు వాడికే వారు మొదటిగా పత్తి కొనుగోలు చేయాలి. ఆ పత్తి కిలో రూ.300 నుంచి రూ.400 ఉంటుంది. ఆ పత్తిని కొనుగోలు చేసి శుభ్రం చేయుటకు మూడు రోజులు పడుతుంది. పిక్క వేరు చేయుటకు ఒక రోజు, మెత్తగా చేసేందుకు ఒకరోజు పడుతుంది. ఇక కిలో పత్తి వడికేందుకు సుమారు ఎనిమిది రోజులు పడుతుంది. ఆ పత్తిని చిలపల రూపంలో మారిస్తే సుమారు 10చిలపలు వస్తాయి. ఈ చిలపలు ఖాదీకి తీసుకు వస్తే వారు వాటిని




మరోపనికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. 100కౌంట్ మీటర్ వస్త్రం ధర 1500నుంచి 2000రూపాయలు వరకు రేట్ పలుకుతుంది. ఇంత రేట్ పలుకుతున్నా తమకు మాత్రం తక్కువకు వస్తుండడంతో మిగిలిన మొత్తం ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయో అర్థం కావటం లేదంటూ నూలు వడికే మహిళా

లెక్కలు వేసి సుమారు చిలపకు రూ.100నుంచి నుంచి రూ.110లకు కొనుగోలు చేస్తారు. అంటే నూలు వడికే కార్మికురాలు 15నుంచి 20దినములు కష్టపడితే రూ.1000 నుంచి రూ.1100 వస్తుంది. అందులో పత్తి కొనుగోలుకు రూ.400, ఖర్చు పోయి రూ.700లు మిగులుతుంది. ఈ నగదుతో కుటుంబం గడవడం కష్టంగా మారుతున్న తరుణంలో నూలు వడికే కార్మికులు దిక్కు తోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. వారి శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఈ పనిచేయలేక,




కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికయినా ఖాదీ ఉన్నతాధికారులు స్పందించి కార్మికులు కష్టాలను గుర్తించి ఖాదీ అభివృద్ధికి మరింత బాటలు వేయాలని పలువురు కోరుతున్నారు.

# వ్యవసాయ రంగానికి స్వర్ణ యుగం

*** బాబాయి అబ్బాయిలతో మారనున్న సిక్కోలు ముఖచిత్రం * పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్**



**సంతబొమ్మాళి, జూన్ 22 (వార్త):** వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు నేడు కొలువుతీరిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని సంతబొమ్మాళి మండలం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్ అన్నారు. శనివారం మర్రిపాడులోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా ఖ్యాతిని దేశ స్థాయిలో తీసుకువెళ్లి జిల్లా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన దివంగత కింజరాపు ఎర్రనాయుడు వారసుడు ప్రస్తుతం కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడం అలాగే జిల్లాపై పూర్తి పట్టు ఉన్న రాష్ట్ర మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు బాధ్యతలు చేపట్టడం ఈ జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసారని అందులో వ్యవసాయ, వంశధార తదితర రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం ఎప్పుడు సంతోషంగా ఉంటుందో అప్పుడు అభివృద్ధి ఫలాలు అందుతాయని తెలిపారు. ఇందులో భాగంగానే చెరువులు, వ్యవసాయ కాలువలు వంశధార కాలువలను అభివృద్ధి చేసే దిశగా అచ్చెన్నాయుడు వ్యూహరచన చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గత ఐదు సంవత్సరాల కాలంలో చెరువులు మరమ్మత్తులు గాని కాలువలు మరమ్మత్తులు గాని చేయలేదని తెలిపారు. అందుకే ప్రస్తుత వర్షాభావ పరిస్థితిలో పశువులు తాగేందుకు కూడా నీరులేని పరిస్థితి ఉందని తెలిపారు. ఈ జిల్లాలో ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న అచ్చెన్నాయుడు ఇటీవల కాలంలో అధికారులతో సమీక్ష చేస్తూ రైతాంగానికి ఎటువంటి ఇబ్బంది తలెత్తే పరిస్థితి రానివ్వొద్దని అధికారులను సూచించడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇష్ట రాజ్యాంగ విత్తనాలు ఎరువులు పంపిణీ జరిగేదని అన్నారు. ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా లబ్ధి చేకూరేలా వ్యూహరచన చేస్తున్నారని చెప్పారు. ప్రతీకార దాడులు ఉండవని ఎన్నికల వరకే రాజకీయాలని ఆ తరువాత సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలుగుదేశమని భరోసా ఇచ్చారు.

## నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి అభినందనలు

సంతబొమ్మాళి మండలం నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దూపాన గౌరీశంకర్, కార్యవర్గ సభ్యులకు అట్టాడ రాంప్రసాద్ అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ నాయకుల తప్పులను ఎత్తిచూపుతూ ఉత్తమ నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత మీడియాపై ఉందన్నారు. పాత్రికేయులు రాజకీయ నాయకులు ఒక విడదీయరాని అనుబంధం ఉంటుందన్నారు.



## మృతుడి కుటుంబానికి గాంధీ పరామర్శ

**బూర్జ, జూన్22(వార్త):** ఇటీవల మండలంలోని అయ్యవారిపేట పంచాయతీలో 32ఏళ్ల యువకుడు చోడ వరపు సత్యనారాయణ పిడుగు పడి మృత్యువాత పడ్డాడు. సమాచారం తెలుసుకున్న సువ్వారి గాంధీ ఆ కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పిన్న వయస్కుడైన సత్యన్నారాయణ కుటుంబ సభ్యుల రోదన చూసి భావోద్వేగానికి గురయ్యారు. అలాగే కటకమయ్యపేటకు చెందిన దేవరపల్లి బారికయ్య కుటుంబంతో పాటు ఆమదాలవలస మండలం కొర్లకోట, పొందూరు, కృష్ణాపురంతో పాటు వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఆయన వెంట రాపాక ఎంపీటీసీ పి సూర్యారావు, పేడాడ వైకుంఠరావు, సువ్వారి అనిల్, విజయ రమణ, గార గోవింద్, గంట్యాడ ధనుంజయ, గురుగుబెల్లి రాజశేఖర్, ప్రశాంత్, శివ, వాసు, రాజారావు, దుర్గారావు, శ్రీనివాస్, రమణ, సురేష్, సూరిబాబు, రమేష్, ఉమా మహేష్, గోపి ఉన్నారు.



### కూన రాకకు
## భారీ ఏర్పాట్లు

**ఆమదాలవలస, జూన్ 22 (వార్త):** ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే కూన రవికుమార్ రాక సందర్భంగా భారీగా ఏర్పాట్లు చేస్తున్నామని టీడీపీ నేత తమ్మినేని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు అమరావతిలో బయలుదేరి విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు 9:30 గంటలకు వస్తారని తెలిపారు. పైడి భీమవరం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ ఉంటుందన్నారు. సాయంత్రం కృష్ణాపురం జంక్షన్ దగ్గర భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారన్నారు.

## కూటమి ర్యాలీని విజయవంతం చేయండి



**బూర్జ, జూన్22(వార్త):** ఆమదాలవలస నియోజకవర్గ కూటమి శాసనసభ సభ్యుడు కూన రవికుమార్ ప్రమాణ స్వీకారం అనంతరం మొదటిసారి నియోజకవర్గానికి విచ్చేస్తున్న సందర్భంగా జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ చేపట్టనున్నారని జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్చార్జ్ పేడాడ రామ్మోహనరావు అన్నారు. ఈ ర్యాలీకి జనసేన శ్రేణులు అందరూ పాల్గొని ఘన స్వాగతం పలకాలని కోరారు. శ్రీకాకుళం సింహద్వారం వద్ద నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ర్యాలీ మొదలు కానుందని తెలిపారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ఈ ర్యాలీకి తరలిరావాలన్నారు.

### శాసన సభాపతిగా అయిదో సారి..

# ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధి

**✳ఆంధ్ర రాష్ట్రానికి రెండో స్పీకర్ 'రొక్కం' ✳సిక్కోలు నుంచే నలుగురు ✳తాజాగా చింతకాయల అయ్యన్నపాత్రుడు**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో ఉత్తరాంధ్ర, ఎప్పుడూ కీలక భూమిక పోషిస్తూనే ఉంది. ప్రత్యక్ష, పరోక్ష రాజకీయాల్లో ఈ ప్రాంతీయుల ప్రభావం అధికంగానే కనిపిస్తుంటుంది. 1932 నాటికే ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, 1952 తొలి సాధారణ ఎన్నికల్లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రులుగా, తొలినాటి రాజకీయ పార్టీలకు అధ్యక్షులుగా, చట్టసభల్లో ప్రతిపక్షనేతలుగా సేవలందించిన ఘనత ఇక్కడి ప్రజాప్రతినిధులు, నేతలుది. అంతేకాకుండా రాజ్యాంగ బద్ధమైన శాసనసభను నడిపే అవకాశం తొలినాళ్లలోనే ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులకు దక్కింది. 1953 అక్టోబర్ 1న ఏర్పడిన ఆంధ్రరాష్ట్రానికి తొలిసారి జరిగిన శాసనసభ ఎన్నికల్లో(మధ్యంతర) కొత్తప్రభుత్వం 1955 మార్చి 30వ తేదీన కొలువుతీరింది. కొత్తగా ఏర్పడిన ఈ శాసనసభను నడిపే బాధ్యత, శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్నికైన రొక్కం లక్ష్మీనరసింహ దొరకు లభించింది. (ఉమ్మడి మద్రాస్ నుంచి విడిపోయి కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్ర శాసనసభకు స్పీకర్ గా, గుంటూరు జిల్లా నరసరావుపేట నుంచి కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ తరుపున ఎన్నికైన నల్లపాటి వెంకటరామయ్య 1953 నవంబర్ 23వ తేదీన ఎన్నికయ్యారు.) ఆ తర్వాత మరో మూడుసార్లు సిక్కోలు నుంచి ఎన్నికైన ఎంఎల్ఎలకు ఆంధ్రప్రదేశ్, విభజిత ఆంధ్రప్రదేశ్‌లలోనూ స్పీకర్లుగా వ్యవహరించే అరుదైన అవకాశం లభించగా తాజాగా ఏర్పడిన ఏపీ అసెంబ్లీకు కూడా ఉత్తరాంధ్ర నుంచి గెలుపొందిన ప్రజాప్రతినిధి, శాసన సభాపతి పీఠంపై కొలువు దీరారు. వారి వివరాలు క్లుప్తంగా తెలుసుకున్నట్లయితే.....

### రొక్కం లక్ష్మీనరసింహ దొర (ఆర్ఎల్ఎన్ దొర)..



ఆంధ్ర రాష్ట్రానికి మధ్యంతం ఎన్నికలు 1955లో జరగటంతో కొత్త ప్రభుత్వం ఆ ఏడాది మార్చి 30న కొలువుదీరింది. కొత్తగా ఏర్పడిన శాసనసభ నిర్వహణ బాధ్యత సిక్కోలు ప్రజాప్రతినిధికు లభించింది. 1955 ఏప్రిల్ 23వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏర్పడిన వరకూ (1956 డిసెంబరు 3వ తేదీ వరకూ) రొక్కం లక్ష్మీ నర్సింహ దొర, ఆంధ్ర రాష్ట్రానికి రెండో స్పీకర్ గా వ్యవహరించారు. (ఆంధ్ర రాష్ట్రానికి చివరి స్పీకర్ కూడా ఈయనే). ఆ సమయం లో బెజవాడ గోపాలరెడ్డి ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం కురుడు గ్రామానికి చెందిన ఆర్.ఎల్.ఎన్. దొర, నాడు అవిభజిత టెక్కలి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎంఎల్ఏగా గెలుపొంది స్పీకర్ స్థానం అధిరోహించారు. స్వతహాగా న్యాయవాది అయిన రొక్కం, ఎపి న్యాయ కమిషన్ సభ్యునిగా, శ్రీకాకుళం జిల్లా బోర్డు తొలి అధ్యక్షునిగా(విశాఖ నుంచి వేరుపడిన తర్వాత) కూడా 1951లో ఎన్నికయ్యారు. టెక్కలి నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలినాళ్లలోనే శాసనసభను నిర్వహించే స్పీకర్ స్థానం అధిరోహించి శభాష్ అనిపించుకున్నారు. 1899 జూన్ 11న జన్మించిన ఆర్ఎల్ఎన్ దొర, 1971 నవంబరు 26న తుదిశ్వాస విడిచారు.

### తంగి సత్యన్నారాయణ..



శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో సారి స్పీకర్ గా అవకాశం వరించింది. జిల్లా నుంచి ఈ స్పీకర్ పదవిని అధిరోహించిన రెండో వ్యక్తిగా తంగి సత్యన్నారాయణను చెప్పుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు తొమ్మిదో సభాపతిగా ఈయన వ్యవహరించారు. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, చరిత్ర పునరావృతం అయినట్లయింది. శ్రీకాకుళం మండం కిల్లిపాలెం గ్రామంలో 1931 సెప్టెంబరు 8న జన్మించిన ఈయన తొలుతు గార సమితి అధ్యక్షులుగా చేశారు. 1967లో స్వతంత్ర పార్టీ తరుపున ఒకసారి, తర్వాత తెలుగుదేశం పార్టీ తరుపున(1983) మరోసారి ఎంఎల్ఏ గా శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి గెలుపొందారు. సభాపతి పదవిని నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు శ్రీకాకుళం జిల్లాకు కేటాయించడంతో తంగి సత్యన్నారాయణ ఈ పదవిని చేపట్టారు. 1983 జనవరి 18వ తేదీ నుంచి 1984 ఆగష్టు 28వ తేదీ వరకూ స్పీకర్ స్థానం లో ఈయన కొనసాగారు. టీడీపీలో ఎన్టీఆర్ పై తొలిసారి తిరుగుబాటు జరగడం, నాదెండ్ల భాస్కరరావు నేతృత్వంలో ప్రజాస్వామ్య టీడీపీ పార్టీ 1984 ఆగష్టులో అధికారం చేపట్టం, తర్వాత సభ రద్దు కావడం తదితర రాజకీయ సంక్షోభాలకు, సంచలనాలకు తంగి సత్యన్నారాయణ ప్రత్యక్ష సాక్షిగా ఆనాడు నిలవవలసి వచ్చింది. ప్రచార సాధనాలు ముఖ్యంగా వార్తాపత్రికలు, రాజకీయ పరమైన, వ్యక్తిగతమైన రాగద్వేషలకు అతీతంగా వ్యవహరించి సభా కార్యక్రమాలను ప్రజలకు అందించాలని 1983 సెప్టెంబరు 19వ తేదీన స్పీకర్ గా ఇచ్చిన రూలింగ్ లో తంగి స్పష్టం చేశారు. 2009 అక్టోబరు 25వ తేదీన తన స్వగ్రామం లో కన్నుమూశారు.

### కావలి ప్రతిభాభారతి..



ఇక, ఆంధ్రప్రదేశ్ 11వ శాసనసభకు 15 వ స్పీకర్ గానే కాకుండా తొలి మహిళా సభాపతిగా (దేశంలో శాసనసభ స్పీకర్ గా ఎన్నికైన తొలి దళిత మహిళ) కావలి ప్రతిభాభారతి వ్యవహరించారు. ఈమె శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి తెలుగు దేశం పార్టీ తరుపున ఎంఎల్ఏగా ఎన్నికై 1999 నవంబరు 11వ తేదీ నుంచి 2004 మే 30 వ తేదీ వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు స్పీకర్ గా సేవలందించారు. ఆ సమయంలో నారా చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. నాటి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని సంతకవిటి మండలం కావాలి గ్రామానికి చెందిన ఈమె, జస్టిన్ కొత్తపల్లి పున్నయ్య కుమార్తెగానే కాకుండా 1983 నుంచి పలుమార్లు రాష్ట్రమంత్రిగా సేవలందించి గుర్తింపు పొంది ఉన్నారు. ప్రతిభాభారతి హాయంలోనే 2000 మే 29, 30, 31 తేదీల్లో అఖిల భారత స్పీకర్ల సదస్సు ఏపీలో జరిగాయి. అదేవిధంగా 2000 సెప్టెంబరు 13వ తేదీన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై జరిగిన చర్చల సమయంలో ఉదయం 8-30 గంటల నుంచి రాత్రి 9-30 వరకూ ఎకధాటిగా సభను నడిపిన ఘనత ఆమెది.

### తమ్మినేని సీతారాం..



ఆంధ్రప్రదేశ్ కు 20వ స్పీకర్ గా, విభజన ఏపీ శాసనసభకు రెండో స్పీకర్ గా శ్రీకాకుళంకు చెందిన సీనియర్ ప్రజా ప్రతినిధి తమ్మినేని సీతారాం 2019 జూన్ 13న ఎన్నికయ్యారు. ఆమదాలవలస మండలం తొగరాం గ్రామంలో జన్మించిన ఈయన 1983 నుంచి శాసనసభకు ఎంఎల్ఏగా ప్రాతినిధ్యం వహించారు. 1983, 1985, 1991(ఉప ఎన్నిక), 1994, 1999 లలో ఆమదాలవలస నియోజకవర్గం నుంచి అయిదుసార్లు టీడీపీ తరుపున, 2019లో వైసీపీ తరువున శాసనసభకు ఎన్నికయ్యారు. ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు కేబినెట్లలో పలు శాఖలకు మంత్రిగా వ్యవహరించారు.

### చింతకాయల అయ్యన్నపాత్రుడు..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 16వ శాసనసభకు సభాపతిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, నర్సీపట్నం తాజా శాసనసభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని నర్సీపట్నంలో 1957లో జన్మించిన అయ్యన్నపాత్రుడు పలుమార్లు చట్టసభలకు ఎన్నికయ్యారు. 1983లో టీడీపీలో చేరి అదేపార్టీ నుంచి నర్సీపట్నం నియోజకవర్గం నుంచి పదిసార్లు పోటీచేసి ఏడు పర్యాయాలు ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ కేబినెట్ లో చిన్నవయసులోనే మంత్రి పదవి ఆయనకు వరించింది. 1984-86 మధ్య సాంకేతిక విద్య, క్రీడలు శాఖామంత్రిగా వ్యవహరించారు. 1994లో ఎన్టీఆర్ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వంలో రోడ్లు, భవనాలు మరియు ఓడరేవుల శాఖా మంత్రిగా సేవలందించారు. 1996లో అనకాపల్లి నుంచి లోక్ సభ సభ్యునిగా టీడీపీ తరుపున గెలుపొందారు. 1999 ఏపీ సాధారణ ఎన్నికల్లో శాసనసభ్యునిగా గెలుపొంది నాటి చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా బాధ్యతలు అయిదేళ్లు నిర్వర్తించారు. తెలంగాణ విభజన అనంతరం 2014లో ఏర్పడిన టీడీపీ సర్కార్ లో మరోసారి మంత్రిగా పనిచేసే అవకాశం లభించింది. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వంలో 2014 నుంచి 2019 వరకు పంచాయితీరాజ్, గ్రామీణ మరియు నీటి సరఫరా శాఖా మంత్రిగా వ్యవహరించారు. 2024 ఎన్నికల్లో ఎడోసారి నర్సీపట్నం నుంచి ఎన్నికై... ఆంధ్రప్రదేశ్ కు 21వ శాసన సభాపతిగా(ఆంధ్ర రాష్ట్రంతో కలిపి 23వ వారు), విభజిత ఏపీ అసెంబ్లీలో మూడో స్పీకర్ గా అయ్యన్నపాత్రుడు కొనసాగనున్నారు. దీంతో ఈ స్పీకర్ పదవి అధిరోహించిన ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు సంఖ్య అయిదుకు చేరింది. అయ్యన్నపాత్రుడు సారథ్యంలో... ప్రజారంజకమైన పాలనా విధానాలు, ఆరోగ్యకర- మేధోపరమైన చర్చలకు, విలువలకు ఏపీ శాసనసభ వేదికగా నిలవాలని ఆశిద్దాం..!!

మరోవెపు ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికైన పలువురు ప్రజాప్రతినిధులు ప్రోటెం స్పీకర్లుగా, ప్యానల్ స్పీకర్లుగా సేవలందించారు. విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి గెలిచిన కోలగట్ల వీరభద్ర స్వామి 2022 సెప్టెంబర్ 19వ తేదీ నుంచి సుమారు రెండేళ్లు పాటు డిప్యూటీ స్పీకర్ గా కొనసాగారు. ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికైన కె. ఎర్రన్నాయుడు, జి. అప్పల సూర్యనారాయణ, ఎం.వి. కృష్ణ రావులు వంటివారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్యానల్ స్పీకర్లుగా వ్యవహరించగా, భోగాపురం మరియు నెల్లిమర్ల స్థానాల నుంచి పలుమార్లు గెలిచిన పతివాడ నారాయణస్వామి నాయుడు 2014లో, బొబ్బిలి నుంచి గెలిచిన శంబంగి వెంకట చిన అప్పల నాయుడు 2019లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రోటెం స్పీకర్లుగా వ్యవహరించారు. ఇప్పటి వరకూ గుంటూరు జిల్లా నుంచి అత్యధికంగా అయిదుగురు 1953 నుంచి స్పీకర్ పదవిని అధిరోహించగా తర్వాత స్థానం శ్రీకాకుళం జిల్లాకు దక్కింది. ఇక చిత్తూరు జిల్లా నుంచి ముగ్గురు ఈ పదవి చేపట్టగా, ప్రకాశం, కరీంనగర్ జిల్లాల నుంచి చెరో ఇద్దరు, కృష్ణా, కర్నూలు, తూర్పుగోదావరి, మెదక్, నెల్లూరు, నిజామాబాద్ ల నుంచి చెరో ఒక్కరు ఏపీ శాసనసభలకు సభాపతులుగా వ్యవహరించగా, తాజాగా ఉమ్మడి విశాఖ నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడికి అవకాశం లభించింది.

**- డా.జి.లీలావర ప్రసాదరావు, ఫ్రీలాన్సర్**



## మంత్రి అచ్చెన్నతోనే అభివృద్ధి

**టెక్కలి, జూన్ 22(వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని అయోధ్యపురం సర్పంచ్ బగాది హరి అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన సందర్భంగా స్థానిక సచివాలయంలో కేకును కట్ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. రాష్ట్రంలోనే టెక్కలి నియోజకవర్గంను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కార్యచరణ రూపొందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తో పాటు మాజీ అధ్యక్షుడు బగాది మాధవరావు వార్డు నంబర్ బాలి డిల్లేశ్వరరావు, దేశెట్టి తవుడు, నీలాచలం, ముఖలింగం పాల్గొన్నారు.

## రావివలసలో విత్తనాలు పంపిణీ

**టెక్కలి, జూన్ 22 (వార్త):** రావివలస రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీ విత్తనాలను టీడీపీ సీనియర్ నేత ఎల్ఎల్నాయుడు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు ఎరువులు ఇతర వ్యవసాయ పరికరాల పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడా లని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బడే జగదీశ్, మాజీ ఎంపిటిసి నర్తు కృష్ణారావు, యాదవ సంఘం నాయకులు ఇప్పిలి జగదీశ్, దాసరి వాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413